సిఎం ప్రజావాణికి 102 దరఖాస్తులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన సిఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 102 దరఖాస్తులు అందాయి. భారీ వర్షం కురుస్తున్నప్పటికీ సిఎం ప్రజావాణిపై భరోసాతో ప్రజా భవన్‌కు ప్రజలు తరలొచ్చారు. వర్షంలో ప్రజలు ఇబ్బంది పడకుండా ప్రజాభవన్ మెయిన్ గేట్ నుంచి ప్రజావాణి వరకు బ్యాటరీ వెహికల్‌లో సిబ్బంది తరలించారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 34, రెవెన్యూ శాఖకు 21, ఇందిరమ్మ ఇండ్ల కోసం 26, ప్రవాసి ప్రజావాణికి 01, ఇతర శాఖలకు 20 దరఖాస్తులు అందాయి. సిఎం ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించారు. ప్రజల సమస్యలను సావదానంగా విన్నారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యల్ని పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై బిఆర్ఎస్ నేతలతో కెసిఆర్ చర్చలు

- జూబ్లీహిల్స్ బిఆర్ఎస్ అభ్యర్థిగా మాగంటి సునీత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీ మంత్రులు హరీశ్ రావు, మహమూద్ అలీ, పద్మారావు గౌడ్, సబితా ఇంద్రారెడ్డితో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ శుక్రవారం సమావేశం అయ్యారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ ఇటీవల మృతి చెందడంతో ఆ నియోజకవర్గంలో ఉప ఎన్నిక అనివార్యం అయింది. కాగా జూబ్లీహిల్స్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ సతీమణి సునీతను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రకటించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్ళాలని సూచించారు. సునీత విజయమే లక్ష్యంగా బీఆర్ఎస్ నేతలకు దిశానిర్దేశం చేశారు. అభ్యర్థి ఎంపిక, నియోజకవర్గ వ్యూహాలు, విజయావకాశాలను పెంపొందించడానికి తీసుకోవలసిన చర్యలపై విస్తృతంగా చర్చ జరిగింది. పార్టీ బలాన్ని మరింత పెంచుతూ జూబ్లీహిల్స్‌లో విజయాన్ని సాధించడానికి సమన్వయంతో కృషి చేయాలని కెసిఆర్ సూచించినట్టు తెలిసింది.

రిజర్వేషన్లపై రెండు రోజుల్లో జిఒ

- బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్

స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌తోనే జరుగుతాయని, రెండు రోజుల్లో రిజర్వేషన్లపై జీవో రానున్నదని బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు దీనిపై న్యాయస్థానాలకు వెళ్లి బడుగు, బలహీన వర్గాల రాజకీయ అభివృద్ధికి అడ్డు పడొద్దని కోరారు. బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో వీరనారి చిట్యాల ఐలమ్మ 130వ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రజకుల ముద్దు బిడ్డ ఐలమ్మ సంపుటిని, ఇనగుర్తి మధు రాసిన పాటను మంత్రి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భూమి కోసం, నిరంకుశ పాలన నుంచి విముక్తి కోసం పోరాడిన ధీర వనిత ఐలమ్మ అని, ఆమె పోరాట స్ఫూర్తిని అందరూ అందిపుచ్చుకోవాలని తెలిపారు. రిజర్వేషన్ల అమలు చేసే బాధ్యత ప్రభుత్వానిదని, కాపాడుకునే బాధ్యత ప్రజలదని అన్నారు. ఆనాడు తెలంగాణ ఏర్పాటుకు కొంత మంది అడ్డంపడితే ఎలా కొట్లాడి సాధించుకున్నామో.. ఈరోజు రిజర్వేషన్లు కాపాడుకోవడానికి మనమంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కులవృత్తులు గౌరవప్రదమైనవే అయినా మారుతున్న కాలానికనుగుణంగా వాటిలో మార్పులు చేసుకోవాలని సూచించారు. యువత చదువును నిర్లక్ష్యం చేయొద్దని తెలిపారు. 119 నియోజకవర్గాల్లో ఎలక్ట్రిక్ డ్రైక్లీనింగ్ కేంద్రాల ఏర్పాటు కోసం ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. బీసీ రిజర్వేషన్లు అమలైతే పలు సమస్యలకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు. ఐలమ్మ విగ్రహం, నిధుల కేటాయింపు, ఉపాధి కల్పన జరగడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ వి.హనుమంతరావు, రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ సారయ్య, ఎమ్మెల్యే ఈ. శంకర్, బీసీ కమిషన్ చైర్మెన్ నిరంజన్, కార్పొరేషన్ అధ్యక్షులు శ్రీకాంత్ గౌడ్, బిసి సంక్షేమ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక రంగంపై సర్కార్ ఫోకస్

- కృష్ణ గోదావరి పరివాహ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రానున్న మూడేండ్లలో రాష్ట్రంలో15 వేల కోట్ల పెట్టుబడులు.... 50 వేల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పర్యాటక రంగాన్ని పెద్దఎత్తున అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం విస్తృత చర్యలు చేపట్టింది. వనరులు, చారిత్రక వారసత్వ సంపద అంతగా లేని ప్రపంచంలోని అనేక దేశాలు టూరిజంపై వచ్చే ఆదాయంతోనే మనుగడ సాధిస్తున్నాయి. అన్ని ఉన్న తెలంగాణ ఈ రంగాన్ని ఆదాయ మార్గంగా మార్చుకోలనే లక్ష్యంతో చారిత్రక, ఆధ్యాత్మిక, పురావస్తు, కృష్ణ గోదావరి పరివాహ ప్రాంతాలతో పాటు ఎకో మొదలగు అన్ని రకాల పర్యాటకంపై దృష్టి పెట్టింది. తెలంగాణ సందర్శన కోసం వచ్చే పర్యాటకులకు సకల వసతులు కల్పించి వారికి మరిచిపోలేని మధురానుభూతి కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర పర్యాటక శాఖ వడివడిగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా అనేక నూతన ప్రాజెక్టులకు శ్రీకారం చుడుతోంది. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్ శిల్పారామం వేదికగా శనివారం నిర్వహించే తెలంగాణ టూరిజం కాంక్లేవ్-2025లో వాటిని రాష్ట్ర ప్రజలకు ఆవిష్కరించనుంది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి కాంక్లేవ్‌లో టూరిజం అభివృద్ధికి చేపట్టనున్న పలు కార్యక్రమాలను ప్రారంభించనున్నారు...పర్యాటక రంగాన్ని కేవలం ఆహ్లాదానికే పరిమితం చేయకుండా దాని నుంచి పెట్టుబడులు ఆకర్షించడం... పెద్ద సంఖ్యలో యువతకు ఉపాధి కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టకుంది. అందులో భాగంగా ప్రభుత్వ-ప్రయివేటు భాగస్వామ్యం (పిపిపి) విధానం ద్వారా పెట్టుబడులను ఆహ్వానిస్తోంది. టూరిజం పాలసీని అధ్యయనం చేసిన పలువురు పెట్టుబడిదారులు రాష్ట్రంలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన హోటళ్లు, వెల్‌నెస్ సెంటర్లు, హాస్పిటాలిటీ ప్రాజెక్టుల ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేశారు. జల విహారాల ప్రోత్సాహంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం హుస్సేన్ సాగర్‌లో 120 సీట్ల సామర్థ్యమున్న డబుల్ డెక్కర్ బోట్‌ను శనివారం రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించనుంది. హైదరాబాద్‌కు ఒక నాడు జీవనాడిగా ఉన్న మూసీ అసలు పేరైన ముచుకుందా పేరును ఈ బోట్‌కు పెట్టారు..

అప్రమత్తంగా ఉండండి

- లోతట్టు ప్రాంతాల ప్రజలను షెల్టర్‌హోంలకు తరలించండి
- ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలు అందుబాటులో ఉండాలి
- హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోండి
- భారీ వర్షాల నేపథ్యంలో అధికారులకు సిఎం రేవంత్ ఆదేశం
- కలెక్టర్లతో మంత్రి పొంగులేటి టెలికాన్ఫరెన్స్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో వర్షాలపై సిఎస్ రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులతో శుక్రవారం సీఎం సమీక్ష నిర్వహించారు. లోతట్టు ప్రాంతాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలనీ, అవసరమైతే వారిని షెల్టర్‌హోంలకు తరలించాలని సూచించారు. నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. హైదరాబాద్ సిటీలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జీహెచ్ఎంసీ, హైడ్రాతో పాటు, ఎన్‌డిఆర్ఎఫ్ ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలు అందుబాటులో ఉండి సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అన్ని విభాగాలను అప్రమత్తం చేయాలని సిఎస్‌కు సూచించారు. అన్ని జిల్లాల కలెక్టర్లు అలెర్ట్‌గా ఉండి పరిస్థితిని సమీక్షించాలని సూచించారు. విపత్తుల నిర్వహణా శాఖ ఆయా జిల్లాల్లో ఇరిగేషన్, విద్యుత్, పంచాయతీరాజ్, రహదారులు, పోలీస్ విభాగాలతో కలిసి సమన్వయంతో పనిచేయాలన్నారు. క్షేత్రస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండి, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులకు తక్షణమే స్పందించాలని సూచించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామనీ, ఎలాంటి ఆందోళన చెందవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మున్సిపల్, మెట్రో వాటర్ బోర్డు, ట్రాఫిక్ విభాగాలు సమన్వయంతో పని చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. రైల్వే లైన్లు, లోలెవెల్ బ్రిడ్జీలు, కాజ్‌వేలుపై ప్రత్యేక దృష్టి సారించి వర్షం నీరు నిల్వకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. . అంటువ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు, ముంపు ప్రాంతాల్లో త్రాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో పోలీస్ సిబ్బందిని గస్తీ కోసం నియమించాలని ఆదేశించారు.

ప్రజా రవాణాకు ఆటంకం కలగకుండా చర్యలు

కలెక్టర్లతో పొంగులేటి టెలికాన్ఫరెన్స్

భారీ వర్షాల నేపథ్యంలో ప్రజా రవాణాకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. భారీ వర్షాలపై శుక్రవారం హైదరాబాద్‌లోని బీఆర్. అంబేద్కర్ సచివాలయం నుంచిప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, డిజిపి జితేందర్‌తో కలిసి కలెక్టర్లు, ఎస్పీలు, హైడ్రా, జీహెచ్ఎంసీ అధికారులతో టెలీకాన్ఫన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో అతిపెద్ద పండుగైన దసరాకు హైదరాబాద్ నుంచి ప్రజలు సొంత గ్రామాలకు వెళతారనీ, వారి రవాణాకు ఎలాంటి ఆటంకాలు ఏర్పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకొని ట్రాఫిక్‌ను కంట్రోల్ చేయాలని సూచించారు. ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా మూసీ పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ఇప్పటికే శివాజీ బ్రిడ్జి కింద భూలక్ష్మి ఆలయం సమీపంలోని లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న 55 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్టు వెల్లడించారు. మూసీ నదిలో నీటి ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో అధికారులు నిరంతరం పర్యవేక్షణలోనే ఉండాలని సూచించారు. హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ జలాశయాల వరదను అంచనా వేసి అంతే పరిమాణంలో దిగువకు నీటిని విడుదల చేయాలని ఆదేశించారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి: సిఎం

భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. లోతట్టు ప్రాంతాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. హైదరాబాద్ సిటీలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. జిహెచ్ఎంసి, హైడ్రాతో పాటు, ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని.. ఆ దిశగా సంబంధిత అధికారులను అప్రమత్తం చేయాలని సి ఎస్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు.

శరీర దానం.. చనిపోయినా బతకడమే

- సమాజ రుగ్మతలపై పోరాడేది కమ్యూనిస్టులే : జాన్ వెస్లీ
- ఆంజనేయులు దంపతుల త్యాగం ఎనలేనిది
- అంతరాలు లేని సమాజం కోసం పోరాటాలు
- పుట్ట అంజనేయులు సతీమణి వరలక్ష్మి మృతదేహం వైద్య కళాశాలకు అప్పగింత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమాజంలో చావు బతుకులు సహజమని, సమాజం కోసం శరీర దానం చేయడమంటే.. చనిపోయినా.. మరో 50 ఏళ్లు బతికి ఉండడమేనని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. సమాజ రుగ్మతలపై నిరంతరం పోరాటాలు చేసేది కేవలం కమ్యూనిస్టు లేనని తెలిపారు. సిపిఎం వనపర్తి జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు సతీమణి, ఐద్వా జిల్లా మాజీ నాయకులు వరలక్ష్మి అనారోగ్య కారణాలతో శుక్రవారం తెల్లవారుజామున కన్నుమూశారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీతో పాటు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి.సాగర్, అబ్బాస్, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు అరుణజ్యోతి తదితరులు ఆమె మృతదేహంపై పుష్పగుచ్చాల్ని ఉంచి నివాళులు అర్పించారు. అనంతరం వారి స్వగృహం నుంచి మెడికల్ కళాశాల వరకు ర్యాలీగా వెళ్లి మెడికల్ కళాశాల విద్యార్థుల పరిశోధనాత్మక ప్రయోజనార్థం మృతదేహాన్ని కళాశాలకు అప్పగించారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. పుట్ట ఆంజనేయులు, వరలక్ష్మి దంపతులు కష్టనష్టాలకు ఓర్చి అన్యోన్యమైన, ఆదర్శవంతమైన జీవితాన్ని గడిపారని చెప్పారు. వనపర్తి జిల్లాలో విద్యార్థి ఉద్యమాలతో పాటు పార్టీ ప్రతిష్టతకు, మహిళా సంఘం ఏర్పాటుకు వరలక్ష్మి కృషి చేశారని తెలిపారు. అలాగే, ఉద్యమంలో పుట్టా ఆంజనేయులుకు అన్ని రకాలుగా అండగా ఉంటూ సహకరించారన్నారు. వరలక్ష్మి మృతి పార్టీకి, ఆ కుటుంబానికి, తీరనిలోటని తెలిపారు. వరలక్ష్మీ లాంటి వాళ్లు చేసిన పోరాటాలను త్యాగాలను స్మరించుకుంటూ సమాజ శ్రేయస్సు కోసం ముందుకు సాగాల్సిన బాధ్యత కమ్యూనిస్టులుగా ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. భవిష్యత్తు తరాలను బాగుపరిచే మెడికల్ విద్యార్థుల పరిశోధనల కోసం మృతదేహాన్ని అప్పగించే త్యాగాన్ని ఆంజనేయులు కుటుంబం తీసుకోవడం గర్వించదగ్గ అంశమని అన్నారు. అనంతరం టి సాగర్ మాట్లాడుతూ.. అది తక్కువ కాలంలో అనారోగ్య సమస్యలతో చికిత్స పొందుతూ అంతలోనే వరలక్ష్మి చనిపోవడం బాధాకరమైన విషయమని అన్నారు. కుటుంబంతోపాటు పార్టీలో కీలకపాత్ర పోషించి, జిల్లా కార్యదర్శిగా పుట్ట ఆంజనేయులు ఎదగడానికి ఆమె కృషి ఎనలేనిదని తెలిపారు. అనంతరం అబ్బాస్ మాట్లాడుతూ.. మెడికల్ విద్యార్థులకు ఉపయోగపడాలన్న సదుద్దేశంతో ఈ మధ్యకాలంలో దాదాపు 160కి పైగా కమ్యూనిస్టు నాయకులు, వారి కుటుంబసభ్యుల భౌతికకాయాలను వైద్య కళాశాలకు అందించేందుకు ముందుకు వచ్చి వైద్య విద్యా పరిశోధనకు ఉపయోగపడ్డారని తెలిపారు. ఇది శాస్త్రీయ ఆలోచనా విధానానికి నిదర్శనమని అన్నారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జయలక్ష్మి మాట్లాడుతూ.. చిన్న వయసులో వరలక్ష్మి చనిపోవడం.. ఆ కుటుంబానికి తీరని దు:ఖాన్ని మిగిల్చిందని అన్నారు. ఉద్యమం రీత్యా జిల్లాకు వచ్చినప్పుడు రాష్ట్ర నాయకులను వరలక్ష్మి తమ సొంత బిడ్డల్లాగా అత్యంత ప్రేమతో చూసుకున్నారని గుర్తుచేశారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు అరుణ జ్యోతి మాట్లాడుతూ.. మహిళా ఉద్యమంలో వరలక్ష్మి కీలకపాత్ర పోషించారని అన్నారు.

రవీంద్రభారతిలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

- బతుకమ్మ ఆడిన మంత్రి సీతక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో బతుకమ్మ సంబరాలు ఆరో రోజు ఘనంగా సాగాయి. తెలంగాణ సంప్రదాయ వైభవాన్ని ప్రతిబింబించేలా సాంస్కృతిక సారథి కళాకారులు ఈ వేడుకల్లో పాల్గొని బతుకమ్మ ఆడుతూ సందడి చేశారు. పూల సోయగాలతో అలంకరించిన బతుకమ్మ చుట్టూ మహిళలు సంప్రదాయ గీతాలతో వాతావరణాన్ని ఆహ్లాద పరిచారు ఈ వేడుకలకు మంత్రి సీతక్క హాజరై మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ సాంస్కృతిక అస్తిత్వానికి ప్రతీక అని అన్నారు. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు ఏనుగు నరసింహా రెడ్డి కళాకారులను అభినందిస్తూ, తెలంగాణ సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించడంలో బతుకమ్మ వేడుకలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు, సాంస్కృతిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకల్లో మంత్రి సీతక్క

నిబద్ధతతో ప్రజలకు సేవ చేయండి

- గ్రూప్-1 ద్వారా ఎంపికైన డిప్యూటీ కలెక్టర్లకు జెఎసి చైర్మన్ లచ్చిరెడ్డి పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విధి నిర్వహణలో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా..నిబద్ధతతో ప్రజలకు సేవ చేయాలని గ్రూప్-1 ద్వారా ఎంపికైన డిప్యూటీ కలెక్టర్లకు తెలంగాణ ఉద్యోగ జెఎసి చైర్మన్ వి లచ్చిరెడ్డి పిలుపునిచ్చారు. కొత్తగా ఎంపికైన అభ్యర్థులు శుక్రవారం హైదరాబాద్‌లోని కమిషనర్ ఆఫ్ ల్యాండ్ రెవెన్యూ అడ్మినిస్ట్రేషన్ (సిసిఎల్ఎ)లో ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ విభాగాలన్నింటిలో రెవెన్యూ శాఖ ముఖ్యమైనదనీ, విద్యార్థుల సర్టిఫికెట్లనుంచి మొదలుకుని భూ సమస్యల వరకు అన్నింటికి జవాబుదారిగా ఉంటుందని చెప్పారు. ప్రజలు ఈ శాఖపై పెట్టుకున్న ఆశలను వమ్ము చేయకుండా సేవలందించాలని కోరారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వానికి మంచి పేరుతేవాలని సూచించారు. రెవెన్యూ శాఖ ప్రాముఖ్యతతో పాటు పౌర సమాజానికి సేవ చేసేందుకు ఉన్న అవకాశాలపై ఈ సందర్భంగా ఆయన వారికి అవగాహన కల్పించారు.

సారధి కళాకారుల సమస్యల పరిష్కారానికి కృషి

- పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో నిర్వహించిన సారధి కళాకారుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సాంస్కృతిక సారధి కళాకారులకు హెల్త్ కార్డులు, మృతిచెందిన కళాకారుల కుటుంబాలకు పరిహారం, మెటర్నిటీ లీవులు, ఏరియర్స్, ఇందిరమ్మ ఇండ్లు, బస్ పాసులు వంటి అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని చెప్పారు. కళాకారులకు జిల్లాకో వాహనం, మైక్ సిస్టం సదుపాయాన్ని కల్పించేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ప్రతి నెల నిర్ణీత తేదిన వేతనాలు, పిఆర్‌సి అమలు, వాహన సదుపాయం, తదితర సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని అన్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సారధి కళాకారులు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ పథకాలపై రూపొందించిన పాటల సిడిని మంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక శాఖ సంచాలకులు ఏనుగు నర్సింహా రెడ్డి, సారధి చైర్ పర్సన్ వెన్నెల గద్దర్ ఇతర కళాకారులు పాల్గొన్నారు.

కార్మికుల శ్రమను దోచుకుంటున్న ఉత్తమ్ బీడీ కంపెనీ

- బట్వాడలో 10 శాతానికి.. 2,3 శాతమే పిఎఫ్ చెల్లింపు
- లక్షల రూపాయల పిఎఫ్ డబ్బుల ఎగవేత..?
- చూసీచూడనట్టు వ్యవహరిస్తున్న కార్మిక శాఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బతుకుదెరువు కోసం బీడీలు చుట్టి తమ రక్తాన్ని చెమటగా మార్చుకుంటున్న బీడీ కార్మికుల జీవితాలతో ఉత్తమ్ బీడీ కంపెనీ ఆడుకుంటోంది. కార్మికులకు చెల్లించాల్సిన ప్రావిడెంట్ ఫండ్ (పిఎఫ్) డబ్బును అక్రమంగా దోచుకుంటూ యాజమాన్యం వారి ఆశలపై నీళ్లు చల్లుతోంది. రామాయంపేట, మెదక్, పాపన్నపేట, నిజాంపేట వంటి పలు మండలాల్లో సుమారు 1600 మంది కార్మికులు ఈ మోసానికి బలవుతున్నారు. కార్మికుల తరపున మాట్లాడాల్సిన కార్మిక శాఖ నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోందని కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. మెదక్ జిల్లా రామాయంపేట కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఉత్తమ్ బీడీ కంపెని, తమ కార్మికుల సంక్షేమాన్ని పక్కనపెట్టి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చట్ట ప్రకారం ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్)లో జమ చేయాల్సిన మొత్తాన్ని తక్కువగా జమ చేస్తూ, కార్మికులను మోసం చేస్తున్నట్టు వెలుగులోకి వచ్చింది. ఈ అక్రమాలపై కార్మిక శాఖ చర్యలు తీసుకోవడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నియమాలను ఉల్లంఘిస్తున్న ఉత్తమ్ యాజమాన్యం

సాధారణంగా, బీడీ కార్మికులకు చెల్లించే నెలవారీ వేతనంలో 10శాతం చొప్పున పిఎఫ్ కోసం కట్ చేయాలి. అంతేకాకుండా, కంపెనీ యాజమాన్యం కూడా తమ వాటాగా మరో 10శాతం కలిపి మొత్తాన్ని కార్మికుల పిఎఫ్ ఖాతాలో జమ చేయాలి. అయితే, ఉత్తమ్ బీడీ కంపెనీ ఈ నిబంధనలను పాటించడం లేదు. కార్మికుల వేతనం నుంచి కేవలం రెండు లేదా మూడు శాతం మాత్రమే పిఎఫ్ కింద కట్ చేస్తోంది. దీనివల్ల కంపెనీ కూడా తక్కువ మొత్తాన్ని మాత్రమే జమ చేస్తూ, కార్మికులకు రావాల్సిన పిఎఫ్ డబ్బును దోచుకుంటోంది. రామాయంపేట, పాపన్నపేట, నిజాంపేట, మెదక్ వంటి పలు మండలాల్లో సుమారుగా 1500 నుంచి 1600 మంది ఈ కంపెనీలో బీడీ కార్మికులుగా పని చేస్తున్నారు. ఒక బీడీ కార్మికురాలు నెలకు సుమారుగా రూ.2500 వేతనం అందుకుంటే, నిబంధనల ప్రకారం రూ.250 పీఎఫ్ కోసం కట్ చేయాలి. అంతేకాకుండా, కంపెనీ తన వాటాగా మరో రూ.250 కలిపి మొత్తం రూ.500 కార్మికురాలి పిఎఫ్ ఖాతాలో జమ చేయాలి. కానీ, ఉత్తమ్ బీడీ యాజమాన్యం కేవలం రూ.50 నుంచి రూ.60 మాత్రమే కట్ చేసి, అదే మొత్తాన్ని కంపెనీ కలిపి జమ చేస్తోంది. దీనివల్ల ఒక్కో కార్మికురాలికి ప్రతి నెలా సుమారుగా రూ.200 నష్టం జరుగుతోంది. కొంతమందికి రూ.20, రూ.30 కూడా పిఎఫ్ కట్ చేస్తున్నట్టుగా కార్మికులు చెప్తున్నారు.

ప్రతి నెలా లక్షల్లో దోపిడీ..?

సుమారు 1600 మంది కార్మికులను మోసం చేస్తూ ఉత్తమ్ బీడీ కంపెనీ ప్రతి నెలా సుమారు రెండు లక్షల నుంచి మూడు లక్షల రూపాయల వరకు కార్మికులకు పిఎఫ్ చెల్లించకుండా తప్పించుకుంటుందని తెలుస్తోంది. కొన్ని సంవత్సరాలుగా ఇదే తంతు కొనసాగుతుండటంతో, పెద్ద మొత్తంలో బీడీ కార్మికులకు కుచ్చుటోపి పెట్టినట్టు కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. కార్మికులు తమ కష్టాన్ని నమ్ముకుని జీవిస్తుంటే, యాజమాన్యం వారి శ్రమను దోచుకుంటోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కార్మిక శాఖ నిర్లక్ష్యంపై ఆగ్రహం

కార్మికుల హక్కులను కాపాడాల్సిన కార్మిక శాఖ ఈ సమస్యపై దృష్టి సారించడం లేదని తీవ్ర ఆరోపణలున్నాయి. కార్మిక శాఖ అధికారులు పట్టించుకోకపోవడం వల్ల కార్మికులకు న్యాయం జరగడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. కార్మిక శాఖ వెంటనే స్పందించి ఉత్తమ్ బీడీ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని, కార్మికులకు రావాల్సిన బకాయిలను వెంటనే జమ చేయించాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు.

తెలంగాణ నూతన డీజీపీగా శివధర్‌రెడ్డి నియమితులయ్యారు. 1994 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన శివధర్‌రెడ్డి.. ప్రస్తుతం ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ఉన్నారు. ఈమేరకు సిఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఆయన అపాయింట్‌మెంట్ ఆర్డర్ అందుకున్నారు.

IN THE COURT OF THE PRINCIPAL SUBORDINATE JUDGE OF HOSUR
O.S.No: 290/2020

Plaintiff: Girijamma
/Vs/
Defendant Nos.5 & 7 :
5) M/s.Sanvi Infra Developer, Office Address No.53, Mana studio, Flat No.301, Pnachavathi colony, Anikonda Rangi Reddy District, Hydrabad-500089.
7) Kalokond Buchaiah S/o.R. Chandrasekaraiah residing at No. Plot No.36/6, Flat No.101, Ragavendra Nilayam, 9th phase, KPHB Colony, Kukutapally, Hydrabad-500072.

NOTICE

The above plaintiff filed a suit for partition and other relief against the defendants. The suit is posted on 6.10.2025 for the appearance of defendant No.5 & 7 namely firm M/s.Sanvi Infra Developer & its partner Kalokond Buchaiah. The defendant No.5 & 7 namely firm M/s.Sanvi Infra Developer & its partner Kalokond Buchaiah, hereby directed to appear in person (or) through pleader on **06.10.2025 at 10.30 A.M** before the above said court failing which the above suit will be decided exparte in your absence.

//BY COURT ORDER//
N. MANJUNATH,
ADVOCATE, Hosur
M.S.No: 206 (A)/2008
#1, Venus Arcade, 1st Floor
Telephone Exchange Road,
Near Court Campus, HOSUR-635 109
Cell: 97904 66837

IN THE HONOURABLE COURT OF THE VI ADDL SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
O.S.No. 282/2021

Between:
Smt. Reddy Satya Suneetha . . . Petitioner/Plaintiff
And:
Beesapu Adilakshmi & 10 others . . . Respondents/Defendants

NOTICE

D10: Vangara Suryanaryana, S/o. Javaharlal Nehru, resident of Flat No 33, Nikhila Apartments, Somasundar Nagar, Bagh Ameerpet, Hyderabad city
D11: Vepuri Venugopal Dass S/o. Manoranjan Dass, aged 43 years, residing at AWHO Colony, Sector A, 209, Goutham Enclave, Secunderabad

Please take notice that the above named plaintiff instituted the above suit for declaration against all of you and other reliefs costs etc..you are hereby summoned to appear in the above court in person or through a pleader duly instructed and the matter stands posted to **30-10-2025 at 10.30 AM** for your appearance, in default of your appearance on that day the suit will be heard and determined in your absence basing on the material available in the court.

ALAJANGI RAMMOHAN
Advocate, Visakhapatnam
Cell No.9440119620

PUBLIC NOTICE
IN THE COURT OF THE IX ADDL DISTRICT AND SESSIONS JUDGE, KOVVURU
O.S.No.14/2024

Between:
Kuniketi Sudharani ...Plaintiff
And
Kuniketi Kotilingam
And 3 others ...Defendants
To:
D3: Kuniketi Srinivasa Rao,
S/o. Koti Lingam,
R/o. D.No. 5-7/21, SRTC quarters,
Near Lalitha Parameswari Temple,
RTC Cross Roads, Hyderabad.

Whereas, the plaintiff has filed the suit against the defendants for partition of the plaint schedule property among the plaintiff and defendants, Whereas the Hon'ble court ordered notice to you and posted the matter for your appearance. Therefore, you are called upon to appear befour the Hon'ble Court **on 08-10-2025 at 10-30 A.M.,** and state your objections if any, else the matter will be decided in your absence.

PYDI VENKATA RAJU
Eluru Advocate, Eluru
Date: 25-09-2025 Cell: 98851 99811

మహారాజశ్రీ తెనాలి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు,
ఓ.యస్.నెం. 225/2017

బిట్వీన్ :
1. గుదిబండి రాజేంద్రప్రసాదరెడ్డి
2. గుదిబండి శ్రీనివాసరెడ్డి ..... వాదులు

ఎదిరి

1. ఆరుమళ్ళ నాగిరెడ్డి (డైడ్)
2. ఆరుమళ్ళ సాంబ్రాజ్యం (డైడ్)
3. గుదిబండి శివ కమల వగైరాలు ...ప్రతివాదులు

టు :
13) ఆరుమళ్ళ మల్లేశ్వరి, భర్త రామజోగిరెడ్డి
14) ఆరుమళ్ళ అనంత శేఖర్ రెడ్డి, తండ్రి రామజోగిరెడ్డి నివాసం: ఫ్లాట్ నెం.4, చైతన్య విలాస్ కాలనీ, హైదర్ గూడ, హైదరాబాదు
17) ఆరుమళ్ళ హరికృష్ణారెడ్డి, తండ్రి అనంత శివారెడ్డి, నివాసం :గౌతమ్ నగర్, ప్రొప్రయిటర్ : అనంత ప్రొడక్ట్స్, బాలానగర్, హైదరాబాదు.

నోటీసు

ఈ నెంబరున ఈదావాలో పై వాదులు మీమీద గుంటూరు జిల్లా, దుగ్గిరాల సబ్ రిజిస్ట్రేషన్, పెనుమూలి గ్రామం తాలూకు జాయింటు ఆస్తుల కొరకు పార్టిషన్ కొరకు పై కోర్టులో దావా దాఖలు చేసి వున్నారు. సదరు దావాలో మీరు ఇంతకుముందు ప్లీడరు గారిని నియమించుకొని వున్నారు. సదరు మొదటివాది అయిన గుదిబండి రాజేంద్రప్రసాదరెడ్డి గారు తన సాక్ష్యము పైకోర్టులో దాఖలు చేసుకొని వున్నారు. మీరు సదరు ప్లీడరు గారిని మార్చుకొనినందున శ్రీ కోర్టువారు మీకు నోటీసులు ఆర్డరు చేసి వున్నారు. మీకు ఎన్నిసార్లు శ్రీ కోర్టువారి ద్వారా నోటీసులు పంపినను, మీరు కావాలని తీసుకొనకుండగా, కాలయాపన చేయుచున్నారు. మీ అందరూ ఒకే కుటుంబమునకు చెందిన రక్త సంబంధీకులై వున్నారు. పైన ఉదహరించిన గుదిబండి రాజేంద్రప్రసాదరెడ్డి గారిని క్రాస్ ఎగ్జామిన్ చేయుట కొరకు ది.9-10-2025న వాయిదా వేయబడి వున్నది, కాబట్టి మీరు స్వయముగా కానీ, మీప్లీడరు గారి ద్వారా కానీ పై కోర్టులో హాజరు అయ్యి, మీ ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనియెడల మీ పరోక్షమందు ఎక్స్పర్టీగా తీర్మానించబడును.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము //
వాయిదా: 9-10-2025

ఇట్లు,
ఆరిమండ రామిరెడ్డి
వేమూరి రాజశేఖర్,
వాదుల తరుపు న్యాయవాదులు
తెనాలి, గుంటూరు జిల్లా
సెల్ నెం. 9440227079

సోఫాలా విభాగంలోకి సెంచరీ మెట్రిసెస్

ప్రజాశక్తి - హైదరాబాద్

సెంచరీ మెట్రిసెస్ "కంఫర్ట్ రీ-ఇంజినీర్డ్"తో సోఫాల విభాగంలోకి ప్రవేశించింది. శుక్రవారం హైదరాబాద్ లో ప్రముఖ బాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు ఆవిష్కరించారు. సోఫాలు సర్టిఫైడ్ ఫోమ్, ప్రీమియం సామగ్రితో 3, 2, సింగిల్ సీటర్, లాంజర్లలో లభిస్తాయని సెంచరీ సోఫస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉత్తమ్ మలాని చెప్పారు. సెంచరీ సోఫాలు ఇంటిని సౌకర్యవంతంగా మార్చి, జీవనాన్ని మెరుగుపరుస్తాయని పివి సింధు అన్నారు.

హైదరాబాద్‌లో లెనోవా స్మార్ట్ ఎఐ ఉత్పత్తుల ప్రదర్శన

హైదరాబాద్: ప్రముఖ ఎలక్ట్రానిక్ కంపెనీ లెనోవా హైదరాబాద్‌లో తన పూర్తి ఎంటర్‌ప్రైజ్ ఎఐ పోర్ట్‌ఫోలియోను ప్రదర్శించింది. ఇది భారతీయ వ్యాపార సంస్థలకు స్మార్ట్ ఎఐ ద్వారా కార్యకలాపాలను ఆధునికీకరించడం, సురక్షితంగా విస్తరించడం లక్ష్యంగా పనిచేస్తోందని ఆ కంపెనీ ప్రతినిధి రోహిత్ మిదా తెలిపారు. భారతదేశంలో 51 శాతం సిఐఒలు ఎఐని వాడుతున్నా, అమలులో సవాళ్లు ఉన్నాయన్నారు. లెనోవో సురక్షిత, స్కేలబుల్ పోర్ట్‌ఫోలియోతో ఈ అంతరాలను పూడుస్తూ వ్యాపార లక్ష్యాలను సాధిస్తుందన్నారు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సొల్యూషన్స్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ అమిత్ మాట్లాడుతూ.. "మా హైబ్రిడ్ ఏఐ ఆర్కిటెక్చర్ ఎడ్జ్, క్లౌడ్‌లను సమన్వయపరుస్తూ డేటా ఇన్‌సైట్లను వేగంగా అందిస్తుంది.

పేస్కేలు వర్తింపజేయండి

- సెర్ప్ ఉద్యోగుల మాదిరిగానే మమ్మల్ని చూడండి
- మంత్రి సీతక్కకు ఉపాధి హామీ ఉద్యోగుల వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉపాధి హామీ చట్టంలో భాగంగా 20 ఏళ్ల నుంచి పనిచేస్తున్న తమకు పేస్కేలు వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఉపాధి హామీ చట్టం ఉద్యోగుల జెఎసి కోరింది. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి సీతక్కకు జెఎసి సభ్యులు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె వద్ద పలు అంశాలను ప్రస్తావించారు. ఏటా కేవలం రూ. 30 కోట్లు అదనంగా వెచ్చిస్తే పేస్కేలు అమలు చేయొచ్చనే విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన మంత్రి సీతక్క పేస్కేల్‌కు సంబంధించిన ఫైల్‌ను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పేస్కేల్‌పై క్యాబినెట్లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న చిరు ఉద్యోగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని స్పష్టం చేశారు. పలు సాంకేతిక సమస్యలను కారణంగా చూపుతూ పే అండ్ అకౌంట్స్ సెక్షన్ తమ జీతాల చెల్లింపుల్లో జాప్యం చేస్తుందని జెఎసి నేతలు మంత్రికి మొర పెట్టుకున్నారు. వెంటనే

మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధిహామీ ఉద్యోగులు

స్పందించిన మంత్రి సీతక్క పే అండ్ అకౌంట్స్ సెక్షన్ అధికారులతో మాట్లాడారు. చిన్న చిన్న సమస్యలతో చిరు ఉద్యోగుల జీతాలు ఆపొద్దనీ, మానవతా దృక్పథంతో వ్యవహరించి జీతాలు చెల్లించాలని ఆదేశించారు. తమ పేస్కేలు డిమాండ్‌కు సానుకూలంగా స్పందించిన మంత్రి సీతక్కకు నరేగా-ఎఫ్‌టీఈఎస్ జెఎసి చైర్మన్ లింగయ్య, ఇతర ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

వర్షపు నీటి సంరక్షణలో తొలిస్థానం దక్కటం హర్షనీయం : మంత్రి సీతక్క

జల సంరక్షణతోనే జన సంరక్షణ సాధ్యమవుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ(సీతక్క) అన్నారు. వర్షపు నీటి సరంక్షణలో తెలంగాణకు దేశంలోనే తొలి స్థానం దక్కటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అవార్డు దక్కటంలో కీలక పాత్ర పోషించిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులను, క్షేత్రస్థాయి సిబ్బందిని శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో అభినందించారు. వర్షపు నీటి సంరక్షణలో దేశంలో కెల్లా తెలంగాణ ఉత్తమ రాష్ట్రంగా ఎంపిక కావడం వెనక తెలంగాణ ప్రభుత్వ సంకల్పంతో పాటు అధికారుల సమన్వయం, క్షేత్రస్థాయి సిబ్బంది పాత్ర మరువలేనిదన్నారు. తెలంగాణ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 5,20,362 వర్షపు నీటి సంరక్షణ పనులు పూర్తి అయ్యాయనీ, చెక్‌డ్యాంలు, ఇంకుడు గుంతలు, రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ వంటి పనుల్లో తెలంగాణ దేశంలోనే తొలి స్థానంలో నిలిచిందని వివరించారు. ప్రజల భాగస్వామ్యంతో జల సంరక్షణ విజయవంతమైందన్నారు.

మన బతుకమ్మ పాట విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్

తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మద్దతుతో రూపొందిన "మన బతుకమ్మ 2025" పూర్తి వీడియో సాంగ్ అధికారికంగా విడుదలైంది. తెలంగాణ బతుకమ్మ ఉత్సవ వైభవాన్ని, సంస్కృతిని అద్భుతంగా చూపిస్తుంది. పుష్పాలతో, లయబద్ధమైన స్వరాలతో, మహిళల సంబరాలతో ఈ వీడియో బతుకమ్మ ఆత్మను ప్రతిబింబిస్తుందని పాట రూపకల్పన బృందం తెలిపింది. ఈ గీతం బతుకమ్మ ఉత్సవ సౌందర్యాన్ని, సాంస్కృతిక గొప్పతనాన్ని ప్రపంచానికి చాటుతుంది. ప్రతి తెలంగాణ ఇంట్లో ఈ పాట ప్రతిధ్వనిస్తుందని పేర్కొన్నారు. ఈ పాట సాహిత్యం, గోరటి వెంకన్న, సంగీతం సురేశ్ బొబ్బిలి, గానం: అదితి భావరాజు, మంగ్లీ , గోరటి వెంకన్న, నృత్య రూపకల్పన: ఈశ్వర్ పెంటి దర్శకత్వం: బద్రప్ప గాజులా భాగస్వామ్యంతో రూపొందించారు.

ఎసిబి వలలో మణుగూరు ఎస్ఐ

- ఆడియో, వీడియో రికార్డుల ఆధారంగా ఎఫ్ఐఆర్ నమోదు

ప్రజాశక్తి - మణుగూరు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బత్తిని రంజిత్ కుమార్‌ను ఎసిబి అధికారులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఖమ్మం ఇన్‌చార్జి ఎసిబి డిఎస్‌పి విజయ్ కుమార్ విలేకరులతో మాట్లాడారు. స్టేషన్ బెయిల్ మంజూరు కోసం రూ.40 వేలు లంచం అడిగాడని, రెండు ఆడియో, ఒక వీడియో క్లిప్పింగ్ ద్వారా డబ్బులు డిమాండ్ చేసిన ఆధారాల ప్రకారం సెక్షన్ 7డీ కింద కేసు నమోదు చేసి, కస్టడీలోకి తీసుకున్నామని ఎసిబి డిఎస్‌పి తెలిపారు. ఈ ఆపరేషన్‌లో ఖమ్మం ఎసిబి సిఐ శేఖర్, సిఐ కృష్ణకుమార్ పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలి

- తెలంగాణ కాంట్రాక్ట్ డాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని తెలంగాణ కాంట్రాక్ట్ డాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఆ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ భరత్ కుమార్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ తరుణ్ ఒక ప్రకటన విడుదల చేశారు. బస్తీ దవాఖానాల్లో ఆరు నెలలగా వేతనాలు చెల్లించకపోవడంతో కాంట్రాక్ట్ డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, ఇతర వైద్య సిబ్బంది అప్పులపాలై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇదే విషయంపై హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్‌ను కలిసేందుకు వెళ్లిన అసోసియేషన్ నాయకులతో అవమానించేలా మాట్లాడారని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యులన్న మర్యాద ఇవ్వకుండా కమిషనర్ గదిలో నుంచి నాలుగో తరగతి ఉద్యోగి చేత తోసి వేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. పాత బకాయిలను తక్షణమే విడుదల చేయడంతో పాటు భవిష్యత్తులో క్రమంతప్పకుండా ప్రతి నెలా వేతనాలు విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

త్వరలో స్థానిక ఎన్నికల నోటిఫికేషన్?

42 శాతం బిసి రిజర్వేషన్లపై జిఒ జారీ

రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌తో డిజిపి భేటీ

నేడు సిఎస్, ఆయా శాఖల ఉన్నతాధికారులతో ఎన్నికల సంఘం సమావేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ త్వరలో విడుదలయ్యే అవకాశముంది. బిసిలకు సంబంధించి 42 శాతం రిజర్వేషన్ల జిఒ విడుదల, శాంతిభద్రతలపై డీజీపీతో రాష్ట్ర ఎన్నికల సంఘం భేటీ, మరోవైపు క్షేత్రస్థాయిలో అధికారులకు శిక్షణా కార్యక్రమాలన్నీ కలిపి దానికి బలం చేకూరుస్తున్నాయి. లోకల్ బాడీ ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన జీవో నెంబర్ 09ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాశ్ జీవో కాపీని విడుదల చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 డి(6), ఆర్టికల్ 243 టి(6) ప్రకారం సీట్ల రిజర్వేషన్ కోసం నిబంధనలు రూపొందించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని పేర్కొన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కేటాయింపు విషయంలో రిటైర్డ్ ఐఎఎస్ డాక్టర్ బుసాని వెంకటేశ్వరరావు ప్రత్యేక కమిషన్, తెలంగాణ ప్రభుత్వం ఫిబ్రవరి 2024లో చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల (ఎస్ఇఇపిసి) సర్వేలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో బిసిల జనాబా 56.33 శాతంతో పోలిస్తే రిజర్వేషన్లు తక్కువగా ఉన్నాయని ఎత్తిచూపుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు కనీసం 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని వన్‌మెన్ కమిషన్ నివేదిక సమర్పించిన విషయాన్ని ప్రస్తావించారు. బీసీ జనాభాకు తగ్గట్టుగా రాజకీయ ప్రాతినిధ్యం సరిపోకపోవడం దృష్ట్యా, వారి సంక్షేమం, అభివృద్ధి కోణంలో స్థానిక సంస్థల్లో ప్రస్తుత రిజర్వేషన్ స్థాయిని 42 శాతానికి పెంచాలని కమిషన్ చేసిన సిఫారసును రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిందని తెలిపారు. "తెలంగాణ వెనుకబడిన తరగతులు (గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల్లో సీట్ల రిజర్వేషన్లు) బిల్లు, 2025 (ఎల్.ఎ.బిల్. నం.04 ఆఫ్ 2025)"ను అన్ని రాజకీయ పార్టీలు ఉభయ సభల్లో ఏకగ్రీవంగా ఆమోదించాయని ప్రస్తావించారు. జీవోకు అనుగుణంగా నడుచుకోవాలని ఆయా శాఖల ఉన్నతాధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను 2011 జనాభా లెక్కల ప్రకారం, బీసీ రిజర్వేషన్లను ఎస్ఈఈఈపీసీ-2024 ప్రకారం ఎన్నికల సంఘం ఇప్పటికే ప్రాథమికంగా ఖరారు చేసిపెట్టింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లలోనూ, మొత్తంగానూ మహిళలకు 50 శాతం సీట్లు దక్కేలా అధికారులు సన్నద్ధం చేసిపెట్టారు.

రాష్ట్ర ఎన్నికల సంఘంతో డిజిపి జితేందర్ భేటీ

రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదినితో డిజిపి డాక్టర్ జితేందర్ శుక్రవారం భేటీ అయ్యారు. వారిద్దరి మధ్య స్థానిక ఎన్నికలకు సబంధించి భద్రతా ఏర్పాట్లపైనే ప్రధాన చర్చ నడిచినట్టు విశ్వసనీయ సమాచారం. ఎన్నికలు ఎప్పుడు జరిగినా శాంతిభద్రతలను పరిరక్షించేందుకు తమ శాఖ సిద్ధంగా ఉన్నట్టు డిజిపి సంకేతాలిచ్చినట్టు తెలిసింది. రాజకీయంగా సున్నితంగా ఉండే పలు ప్రాంతాలు, నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలు, ఎన్నికల సమయంలో పోలీసులు శాఖ పాత్రపై ప్రధానంగా చర్చ జరిగినట్టు వినికిడి. మావోయిస్టుల ప్రభావం రాష్ట్రంపై లేదనీ, సున్నిత ప్రాంతాల్లో శాంతిభద్రతలను అదుపులో ఉంచేందుకు అన్ని విధాలుగా సహకరిస్తామని ఎన్నికల సంఘానికి డీజీపీ జితేందర్ హామీ ఇచ్చినట్టు తెలిసింది.

నేడు ఎన్నికల సంఘం ఉన్నతస్థాయి సమావేశం

స్థానిక ఎన్నికల నిర్వహణపై తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఉన్నతస్థాయి సమావేశాన్ని శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నది. ఆ సమావేశంలో సిఎస్ రామకృష్ణారావు, డిజిపి, పంచాయతీరాజ్‌శాఖ ఉన్నతాధికారులు, కలెక్టర్లు పాల్గొననున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై చర్చించనున్నది. ఆ తర్వాత శనివారం సాయంత్రంగానీ, ఆదివారం గానీ రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు మీడియా సమావేశాన్ని నిర్వహించి ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను అధికారికంగా విడుదల చేసే అవకాశముందని ప్రచారం జరుగుతున్నది.

చిలకమర్తి రచనలు తెలుగు భాషను సుసంపన్నం చేశాయి

ప్రజాశక్తి - కల్చరల్

చిలకమర్తి లక్ష్మి నరసింహం రచనలు తెలుగు భాషను సుసంపన్నం చేశాయి అని రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె వి రమణ అన్నారు. రవీంద్ర భారతి లోని సమావేశ మందిరంలో కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ నిర్వహణలో విఖ్యాత సాహితీ వేత్త చిలకమర్తి లక్ష్మి నరసింహం జయంతి సందర్భం గా ప్రముఖ నాటక రచయిత నటుడు తడకమల్ల రామచంద్రరావుకు కిన్నెర చిలకమర్తి సాహితీ పురస్కార ప్రదానం సభ జరిగింది. ముఖ్య అతిథిగా డాక్టర్ రమణ పాల్గొని పురస్కార ప్రదానం చేసి మాట్లాడారు చిలకమర్తి తెలుగు సాహిత్యం సజించనీ సాహిత్య ప్రక్రియ లేదని అన్నారు. ఆయన రాసిన ప్రహసనాలు నాటి సామాజిక ఆర్థిక రాజకీయ వ్యవస్థల్ని వ్యంగ్య ధోరణిలో చూపుతాయి అని చెప్పారు. ఆయన రచించిన గయోపాఖ్యానము నాటకం నేటికి అజరామరంగా నిలిచి ఉందన్నారు. పురస్కారగా గ్రహీత రామ చంద్రరావు ఆరు దశాబ్దిలుగా తెలుగు నాటక రంగంలో తన దైన ముద్ర నటునిగా రచయిత గా వేసుకున్నారని అభినందించారు. విశ్రాంత సివిల్ సర్వీస్ అధికారి మందివెలుగు ముక్తేశ్వర రావు అధ్యక్షత వహించగా సినీ నటుడు సుబ్బరాయ శర్మ చిలకమర్తి సోదరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ డాన్‌ల వెన్నులో వణుకు

- వేటాడి అంతర్రాష్ట్ర ముఠాలు, డాన్‌లకు రాష్ట్ర పోలీసుల చెక్
- రోజుల తరబడి ఇతర రాష్ట్రాల్లో పోలీసుల విచారణ
- ఏజెంట్లుగా యువత, ఉన్నతవర్గాలు, సెలబ్రిటీలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డ్రగ్స్ మాఫియాలు కోట్లు గడిస్తోంది. దేశంలోని ప్రముఖ పట్టణాలు డ్రగ్స్ మాఫియాకు అడ్డాగా మారాయి. యువకులు, విద్యార్థులు, ఉన్నతవర్గాలు, సినీ పరిశ్రమలకు చెందిన వారితోపాటు ఐటీ ఉద్యోగులను ఎంచుకుని గుట్టుచప్పుడు కాకుండా గంజాయి, డ్రగ్స్ సరఫరా చేస్తూ కోట్లు గడిస్తున్నాయి. మాదక ద్రవ్యాలకు అలవాటై, బానిసలుగా మారిన వారినే టార్గెట్ చేస్తున్న ఈ మాఫియా వారిని డ్రగ్స్ సరఫరాదారులుగా, ఏజెంట్లుగా మారుస్తోంది. డ్రగ్స్ దందా రాష్ట్రంలోనూ పెరిగిపోయింది. దీన్ని అడ్డుకునేందుకు ప్రభుత్వ ఆదేశాలతో రాష్ట్ర పోలీసు యంత్రాంగం విస్తృతంగా ప్రయత్నం చేస్తోంది. రాష్ట్రంలో మాదకద్రవ్యాలు, గంజాయిపై రాష్ట్ర పోలీసులు ఉక్కుపాదం మోపుతుండటంతో డ్రగ్స్ డాన్‌లకు గ్రేటర్ హైదరాబాద్ అంటేనే వెన్నులో వణుకు పుడుతోంది.

డ్రగ్స్‌ను క్షేత్రస్థాయి నుంచి నివారించాలని పోలీసులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ మూడు పోలీస్ కమిషనరేట్ల పోలీసులతోపాటు ప్రత్యేకంగా నార్కోటెక్, ఈగల్ బృందాలను ప్రభుత్వం రంగంలోకి దించింది. ఈ క్రమంలో కొద్దిరోజుల కిందట సూరారం, జీడిమెట్ల తదితర ప్రాంతాల్లో దాడులు నిర్వహించిన ఈగల్ బృందాలు ఒజి వీడ్ అనే మత్తుపదార్థాలను స్వాధీనం చేసుకుని పలువురు ఇంజినీరింగ్ విద్యార్థులను అరెస్టు

చేశాయి. జూన్ నెలలో రాచకొండ పోలీసులు, ఈగల్ బృందాలు ప్రత్యేక నిఘావేసి రూ.5 కోట్ల విలువచేసే 935 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో గోవా, ముంబయి, రాజస్థాన్, బెంగళూర్, ఢిల్లీ తదితర రాష్ట్రాలకు పారిపోతున్న డ్రగ్స్ మాఫియా అక్కడే అడ్డా పెడుతోంది. అక్కడి నుంచే దందా కొనసాగిస్తోంది.

ఒకటికి పదిసార్లు..

గ్రేటర్ హైదరాబాద్‌లో డ్రగ్స్, గంజాయితోపాటు ఇతర మాదకద్రవ్యాలను సరఫరా చేయాలంటే స్మగ్లర్లు ఒకటికి పదిసార్లు ఆలోచిస్తున్నారు. వారు నేరుగా నగరానికి రాకుండా ఇక్కడి ఏజెంట్లనే ఇతర రాష్ట్రాలకు రప్పించుకుని డ్రగ్స్‌ను విక్రయిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో స్థానిక పోలీసుల హస్తం ఉండటతో ఆయా రాష్ట్రాల్లో డ్రగ్స్ మాఫియా రెచ్చిపోతోంది. దర్యాప్తులో భాగంగా రాష్ట్ర పోలీసులు ఇతర రాష్ట్రాలకు వెళ్లి విచారణ చేపడితే ప్రధాన స్మగ్లర్లకు తెలిసిపోతోంది. దర్యాప్తుకు సైతం స్థానిక పోలీసులు సహకరించడం లేదని అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. దాంతో రోజుల తరబడి రాష్ట్ర పోలీసులు అక్కడే నిఘా వేస్తున్నారు. ఇలాంటి సమస్యలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర పోలీసులు జాతీయ సంస్థల సమన్వయంతో ముందుకు వెళ్లాలని నిర్ణయించారు. వారి సహకారంతోనే పూర్తి స్థాయిలో డ్రగ్స్ స్మగ్లర్లను కట్టడి చేయగలమని ఓ అభిప్రాయానికి వచ్చినట్టు తెలిసింది. ఇందులో భాగంగా డిఆర్ఐ, ఎన్‌సిబి లాంటి జాతీయ దర్యాప్తు సంస్థలతో సమన్వయం చేస్తున్నారు.

డ్రగ్స్ డాన్లకు చెక్..

గోవా, ఢిల్లీ, ముంబయి, రాజస్థాన్, బెంగళూరు తదితర రాష్ట్రాల్లో అడ్డావేస్తున్న స్మగ్లర్లతోపాటు దేశవ్యాప్తంగా ఏజెంట్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఎల్ఎస్‌డి, ఎండిఎంఎ, ఒజి వీడ్ గంజాయి వంటి మాదకద్రవ్యాలను సరఫరా చేస్తున్నారు. హర్యానాకు చెందిన నరేంద్ర ఆర్య గోవాలో డ్రగ్స్ మాఫియాకు సూత్రధారి. పోలీసులు దాడి చేయకుండా భారీ భద్రత, అందుకు తోడుగా మేలిమి జాతి కుక్కలతో కాపలా ఏర్పాటు చేసుకున్నప్పటికీ రాష్ట్ర పోలీసులు ఆయన అడ్డాపై దాడి చేశారు. ఈ ఆపరేషన్‌లో స్థానిక పోలీసులు సహకరించకున్నా కింగ్‌పిన్‌కు బేడీలు వేశారు. దేశవ్యాప్తంగా డ్రగ్స్ డాన్లుగా పేరొందిన స్టార్ బాయ్, టోనీని సైతం అరెస్టు చేసేందుకు ముంబయి, ఢిల్లీలో ప్రయత్నించిన రాష్ట్ర పోలీసులపై దాడులు నిర్వహించినా చివరకు వారి ఆగడాలకు చెక్ పెట్టారు. ఇదే తరహాలో ఇతర రాష్ట్రాల్లో రాష్ట్ర పోలీసులు ఐదారు కిలోమీటర్లు ఛేజింగ్ చేసి వేర్వేరు చోట్ల డ్రగ్స్ మాఫియాను అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన స్మగ్లర్లను పట్టుకునే సమయంలో పోలీసులు తీవ్రంగా శ్రమించాల్సి వస్తోంది.

కోడ్ భాషలో సరఫరా..

బీటెక్, ఇంజనీరింగ్ వంటి ఉన్నత చదువులు చదువుకున్న విద్యార్థులు, ఐటి ఉద్యోగులు, సంపన్నుల పిల్లలను, యువతను టార్గెట్ చేసుకుని డ్రగ్స్ దందా కొనసాగిస్తున్న డ్రగ్స్ మాఫియా కోడ్ భాషలో ఐడిలు క్రియేట్ చేసి డ్రగ్స్ వివరాలు, వాటి రేట్లను ప్రదర్శిస్తున్నారు. ఎక్కడా పోలీసులకు చిక్కకుండా కొన్ని సందర్భాలల్లో కొరియర్‌లో సరఫరా చేస్తున్నారు. కొద్ది రోజుల కిందట సీతాఫల్‌మండిలో టాస్క్‌ఫోర్సు పోలీసులు, స్థానిక పోలీసులు దాడులు నిర్వహించి ఇద్దరు సరఫరాదారులను అరెస్టు చేశారు. వారి నుంచి ఏండీఏంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇదే తరహాలో నార్కోటెక్, ఈగల్ బృందాలు పలుముఠాలను అదుపులోకి తీసుకుని భారీ ఎత్తున మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకుంటున్నాయి.

సిఎం ఏకపక్ష నిర్ణయాలతో ప్రజలపై రూ.15 వేల కోట్ల భారం

- ఎల్‌అండ్‌టిపై పగబట్టిన రేవంత్ రెడ్డి
- ఆ సంస్థకు కేటాయించిన భూములపై ముఖ్యమంత్రి కన్ను
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఎం రేవంత్ రెడ్డి కక్షకట్టి మెట్రో నుంచి ఎల్ అండ్ టిని బయటికి పంపించడంతో ప్రజలపై రూ.15 వేల కోట్ల భారం పడిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. మేడిగడ్డ బ్యారేజ్ విషయంలో బిఆర్ఎస్ ను అప్రతిష్టపాలు చేసేందుకు ఎల్ అండ్ టి సహకరించకపోవడంతో ఆ సంస్థపై ముఖ్యమంత్రి పగబట్టారని ఆయన ఆరోపించారు. ఆ సంస్థకు ఒఆర్ఆర్ చుట్టుపక్కలా కేటాయించిన 280 ఎకరాల భూమిపై సిఎం, ఆయన అనుచరుల కన్నుబడిందని దుయ్యబట్టారు. అందుకే ఎల్ అండ్ టి సంస్థను వేధించి నిష్క్రమించేలా చేశారన్నారు. ఎయిర్‌పోర్ట్ మెట్రో రద్దుతో మొదలుపెట్టి ఆ సంస్థను నానా రకాలుగా వేధించారని తెలిపారు. మేడిగడ్డ విషయంలో తామే మరమ్మతులు చేస్తామని ఎల్ అండ్ టి ముందుకురావడం రేవంత్ రెడ్డికి కంటగింపుగా మారిందని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. "2014లో మేము అధికారంలోకి వచ్చే నాటికి మెట్రో పనులు కేవలం 20-25 శాతం మాత్రమే పూర్తయ్యాయి. కేవలం మూడేళ్లలోనే 2017 నవంబర్ 29న ప్రధాని నరేంద్రమోడీ చేతుల మీదుగా మొదటి దశను ప్రారంభించాం. కరోనా కష్టకాలంలోనూ సంస్థ నష్టాల్లో ఉందని భయపడితే, కేసీఆర్ మరోసారి అండగా నిలిచి, రూ.3,000 కోట్ల వడ్డీలేని రుణం (సాఫ్ట్ లోన్) మంజూరు చేసి, అందులో రూ.900 కోట్లు విడుదల చేసి మెట్రోను కాపాడారు. మా ప్రభుత్వ హయాంలో రోజుకు ఐదు లక్షల మంది ప్రయాణించే స్థాయికి, పీక్ అవర్స్‌లో కోచ్‌లు సరిపోనంతగా మెట్రోను అభివృద్ధి చేశాం. 69 కిలోమీటర్ల లైన్ పూర్తి చేసి, దేశంలోనే రెండో అతి పెద్ద మెట్రో నెట్‌వర్క్‌గా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాం. కాంగ్రెస్ హయాంలో ఆవాస హెూటల్ వరకే ఉన్న లైన్‌ను, లక్షలాది ఐటీ ఉద్యోగులు పనిచేసే మైండ్ స్పేస్ వరకు పొడిగించి, స్కైవాక్‌లు నిర్మించి ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాం".. అని కెటిఆర్ తెలిపారు.

"మేము అధికారం నుంచి దిగిపోయే ముందు, హైదరాబాద్ భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని 400 కిలోమీటర్ల మెట్రో విస్తరణకు ప్రణాళికలు రచించాం. ఓఆర్ఆర్ చుట్టూ 160 కిలోమీటర్లు, భువనగిరి, సంగారెడ్డి, షాద్‌నగర్, కడ్తాల్ వరకు విస్తరణకు క్యాబినెట్ ఆమోదం తెలిపాం. అత్యంత కీలకమైన మైండ్ స్పేస్-శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోకు టెండర్లు పూర్తి చేసి, కెసిఆర్ చేతుల మీదుగా శంకుస్థాపన చేయించాం. భూసేకరణ అవసరం లేకుండా, పిల్లర్లు లేకుండా భూమ్మీదనే నిర్మించేలా దీన్ని డిజైన్ చేశాం. కానీ, రేవంత్ రెడ్డి అధికారంలోకి రాగానే తీసుకున్న మొదటి అనాలోచిత నిర్ణయం ఎయిర్‌పోర్ట్ మెట్రో రద్దు. నా భూములు ఉన్నాయనీ, బిఆర్ఎస్ నేతలకు లబ్ధి చేకూరుతుందని పిచ్చి పిచ్చి ఆరోపణలతో ప్రాజెక్టును రద్దు చేసి ఎల్ అండ్ టిపై మొదటి దెబ్బ వేశారు. అప్పటి నుంచే సీఎంకు, ఎల్ అండ్ టికి మధ్య పంచాయితీ మొదలైంది"... అని కెటిఆర్ అన్నారు. "మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగినప్పుడు, రాష్ట్ర ప్రభుత్వంపై ఒక్క రూపాయి భారం పడకుండా సొంత ఖర్చులతో రిపేర్ చేస్తామని ఎల్ అండ్ టి ముందుకు వచ్చింది. కాళేశ్వరాన్ని 'కూలేశ్వరం' అని బద్నాం చేద్దామనుకున్న రేవంత్ రెడ్డి ప్రచారానికి ఇది గండికొట్టింది. తమ రాజకీయ లబ్ధికి ఎల్ అండ్ టి సహకరించలేదనే కోపంతో సిఎం ఆ సంస్థపై పగబట్టారు. అక్కడి నుంచి ఎయిర్‌పోర్ట్ మెట్రో వరకు ప్రతి విషయంలో ఆ సంస్థను వెంటాడి, వేధించారు. నారాయణపేట-కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో టెండర్ వేసినఎల్ అండ్ టికి క్వాలిఫికేషన్ లేదని చెప్పి, తన అనుచరుడైన బాంబులేటి శ్రీనివాస్ రెడ్డి సంస్థకు పనులు కట్టబెట్టారు. 'మేడిగడ్డ కూలిపోయిందని చెప్పకుంటే బ్లాక్ లిస్టులో పెడతా' అని బెదిరించారు. ఈ కక్ష సాధింపు చర్యలు భరించలేకే 2070 వరకు లీజు ఉన్న ఎల్ అండ్ టి సంస్థ రాష్ట్రం నుంచి వాకౌట్ చేసింది. 'తెలంగాణ రైజింగ్' అని చెప్పుకొనే సిఎం పెట్టుబడులకు స్వర్గధామమైన రాష్ట్రం నుంచి ఒక ప్రతిష్టాత్మక సంస్థ ఎందుకు పారిపోయిందో సమాధానం చెప్పాలి" అని కెటిఆర్ డిమాండ్ చేశారు.

ఒకవైపు అప్పు పుట్టడం లేదని చెబుతున్న సిఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే రూ.2.20 లక్షల కోట్లు అప్పు చేశారని, ఇప్పుడు దానికి తోడు రూ.15 వేల కోట్ల భారం ప్రజలపై మోపారనివిమర్శించారు. ఎల్ అండ్ టికి కేటాయించిన 280 ఎకరాల భూములను, ఉన్న మాల్స్ ను ఎవరెవరికి రాసిస్తారో త్వరలో చూస్తారని కేటీఆర్ తెలిపారు. రేవంత్ రెడ్డి ఒక్క స్కీంలో ఒక్కో స్కాం దాగుందని విమర్శించారు. మరో కార్పొరేట్ సంస్థను ఎలా బ్లాక్ మెయిల్ చేస్తున్నారనో నాలుగైదు రోజుల్లో బయటపెడతానని కెటిఆర్ వెల్లడించారు.

అరబిందో ఫార్మాను ఆదివారం తగులబెడతా..

- రైతులకు అన్యాయం జరుగుతుంటే ఇక చూస్తూ ఊరుకోలేను
- అధికారులకు, అరబిందోకు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అల్టిమేటం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం ముదిరెడ్డిపల్లి శివారులోని అరబిందో ఫార్మా నుంచి వస్తున్న వాయు కాలుష్యం, జల కాలుష్యం వల్ల రైతులు అనేక ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా ఫార్మాని తగలబెడతానని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం తన కుటుంబంతో కర్నాటక యాత్రలో ఉన్న అనిరుధ్ రెడ్డి ఒక వీడియోను మీడియాకు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అరబిందో ఫార్మా నుంచి వస్తున్న వాయు కాలుష్యంపై అసెంబ్లీలో ఫిర్యాదు చేసినా, జిల్లా స్థాయి అధికారులను పలుమార్లు హెచ్చరించినా కంపెనీ ముద్దిరెడ్డిపల్లి చెరువులోకి కలుషిత జలాలను వదలడం ఆపడం లేదన్నారు. ఈ వ్యవహారంలో తక్షణం చర్యలు తీసుకోవడానికి కాలుష్య నియంత్రణ మండలికి ఒక్క రోజు టైమ్ ఇస్తున్నానని, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చర్యలు తీసుకోక పోతే ఆదివారం 11గంటలకు అరబిందో ఫార్మా వద్దకు వెళ్లి ఆ కంపెనీని తగులబెడతానని హెచ్చరించారు. పోలేపల్లి ఫార్మా సెజ్‌లోని అరబిందో ఫార్మా కంపెనీ ముద్దిరెడ్డిపల్లి చెరువులోకి కలుషిత జలాలను వదులుతున్న కారణంగా పంటలు పండటం లేదన్నారు. చెరువులో ఉన్న చేపలు కూడా చనిపోతున్నా యని తెలిపారు.

తాను గతంలోనే అసెంబ్లీలో ఫిర్యాదు చేసినా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు పట్టించుకోలేదని చెప్పారు. ఈ విషయంలో అధికారులకు, అరబిందో ఫార్మాకు మధ్య ఏ లాలూచీ ఉందో తనకు తెలియ దన్నారు. మరోసారి కలుషిత జలాలను చెరువు లోకి వదిలితే సహించేది లేదని గతంలోనే తాను హెచ్చరించానని గుర్తు చేశారు. అయినప్పటికీ తన హెచ్చరికలను పెడచెవిన పెట్టి అరబిందో ఫార్మా కంపెనీ మళ్లీ కలుషిత జలాలను చెరువులోకి వదులుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి సంబంధించిన వీడియోలు, ఫోటోలను కూడా మీడియాకు విడుదల చేశారు. కలుషిత జలాలను చెరువు లోకి వదలడం వెంటనే ఆపాలని, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈ విషయంలో తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కవ్వాల్ అడవుల్లో అక్రమ గుడిసెల తొలగింపు

- భారీగా మోహరించిన అటవీ అధికారులు, పోలీసులు
- ముందుగానే వెళ్లిపోయిన గిరిజనులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆసిఫాబాద్ జిల్లా జన్నారం మండలం ఇంధన్‌పల్లి అటవీ రేంజ్ కవ్వాల్ అటవీ సెక్షన్ పరిధిలోని పాలగోరి అడవుల్లో అక్రమంగా వేసిన గుడిసెలను అటవీశాఖ అధికారులు, పోలీసులు సంయుక్తంగా తొలగించారు. శుక్రవారం తెల్లవారుజామునే పోలీసులు, అటవీ అధికారులు మొత్తం 200 మందికిపైగా ఆ ప్రాంతానికి చేరుకున్నారు. పెద్ద ఎత్తున బలగాలను మోహరించారు. అక్కడ ఆసిఫాబాద్ జిల్లా జైనూర్, నార్నూర్ మండలాలకు చెందిన గిరిజనులు విలువైన టేకు చెట్లను నరికి ఆ భూమిలో గుడిసెలు వేసుకున్నారు. కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ భూముల్లో అక్రమంగా గుడిసెలు వేయడం సరికాదని, విలువైన టేకు చెట్లను నరికితే చట్ట ప్రకారం శిక్షలు ఉంటాయని జన్నారం ఎఫ్‌డీఓ రామ్మోహన్ హెచ్చరించారు. పోలీసులు, అటవీశాఖ అధికారులు సంయుక్తంగా కలిసి వెళ్లేలోపే అక్కడున్న ఆయా మండలాల గిరిజనులు ముందుగానే వెళ్లిపోయారు. పోలీస్, అటవీశాఖ అధికారులు కలిసి గిరిజనులు వేసిన గుడిసెలను పూర్తిగా తొలగించారు. ఈ కార్యక్రమంలో ఇంధన్‌పల్లి ఎఫ్ఆర్ఓ శ్రీధర్ చారి, జన్నారం ఇన్‌చార్జి తహసీల్దార్ సుష్మారావు, ఎస్ఐ గొల్లపల్లి అనూష, దండేపల్లి ఎస్ఐ తహసీనుద్దీన్, అటవీశాఖ అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

మానవీయతకు దర్పణం జాషువా కవిత్వం

ప్రజాశక్తి - కల్చరల్

జాషువా కేవలం దళితుల కోసం సాహితీ సష్టి చేయలేదు అని ఆయన కవిత్వం మానవీయతకు దర్పణం అని రాష్ట్ర శాసన మండలి ప్రతి పక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి అన్నారు ఇందుకు ఉదాహరణ ఫిరదౌసి కావ్యం అని ఉదహరించారు. శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళా వేదికపై గాన సభ నిర్వాహణలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా గుర్రం జాషువా యాదిలో పేరిట సంస్మరణ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మధుసూదనాచారి మాట్లాడుతూ నాడు సమాజంలో దళితుల పట్ల విచక్షణ, చిన్న చూపు వంటి వాటిని భరించి స్వయం కృషితో ఎదిగిన జాషువా గొప్ప కావ్యాలను రాసి విశ్వనాథ సత్యనారాయణ వంటి దిగ్గజ పండితులతో సమంగా నిలిచారని వివరించారు. ఆయన రచించిన గబ్బిలం కావ్యం దళితుల అవేదన ఆక్రోశం తెలియ పరిస్తుంది అన్నారు. తిరుపతి వెంకట కవులులో ఒకరు ఇన చెళ్లపిళ్ల వెంకట శాస్త్రిచే కాలికి గండ పెండేరం సత్కారం పొందిన మహా సాహితీ వృక్షం జాషువా అని చెప్పారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదికపై గాయకుడు త్రినాథ రావు వందే భారత్ చిత్ర దర్శకుడు మల్లం రమేష్ సంఘ సేవకుడు విఎస్ఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు